# డీజిల్ కొరతా..? నిబంధనల ప్రభావమా..?

## రైతుల ఇబ్బందులు అధికారుల ముందున్న సవాల్



చర్ల, జూన్ 17(వుదయం ప్రతినిధి) చర్ల మండల వ్యాప్యంగా వర్షాకాల వ్యవసాయ పనులు జోరందుకున్న వేళ డీజిల్ అందుబాటుపై నెలకొన్న పరిస్థితులు రైతాంగంలో ఆందోళనకు దారితీస్తున్నాయి. ఒకవైపు దుక్కులు దున్నడం, విత్తనాలు వేయడం వంటి వ్యవసాయ పనులకు ట్రాక్టర్ల కు భారీగా డీజిల్ అవసరం కాగా, మరోవైపు ఇంధన విక్రయాలపై అమల్లో ఉన్న 90 రోజుల కఠిన నిబంధనలు రైతులను, పెట్రోల్ బంకు యాజమాన్యాలకు ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెడుతున్నాయని చర్చ జరుగుతోంది.ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇర్పా రాజు దొర విడుదల చేసిన ప్రకటనలో చర్ల మండలంలో రైతులకు డీజిల్ కొరత లేకుండా అధికారులు, పెట్రోల్ బంకు యాజమాన్యాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మండలంలో ఐదు ఇంధన బంకులు ఉన్నప్పటికీ రైతులకు అవసరమైన సమయంలో డీజిల్ అందకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆయన పేర్కొన్నారు.భద్రాచలం ఏజెన్సీలో రైతుల పరిస్థితి భిన్నంగా ఉంటుంది అని తెలిపారు. చర్ల మండలం పూర్తిగా వ్యవసాయ ఆధారిత, గిరిజన ప్రాంతం కావడంతో మైదాన ప్రాంత తో పోలిస్తే రైతుల పరిస్థితి చాలా భిన్నంగా ఉంటుంది . చాలా మంది రైతులకు సొంత ట్రాక్టర్లు లేకపోవడంతో అద్దె ట్రాక్టర్లపై ఆధారపడుతున్నారు. ట్రాక్టర్ యజమానులు పొలాలకు వచ్చి దుక్కులు దున్నాలంటే రైతులే క్యాన్లలో డీజిల్ తీసుకెళ్లి అందించడం సాధారణంగా జరుగుతోంది.మారుమూల గ్రామాల నుంచి ట్రాక్టర్లను ప్రతి సారి పెట్రోల్ బంక్‌కు తీసుకురావడం సాధ్యం కాదని రైతులు చెబుతున్నారు. ఇలా చేస్తే సమయం, ఇంధనం రెండూ వృథా అవుతాయని వారు వాపోతున్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త ఆంక్షలతో రైతులకు ఇంకా పెరిగిన సమస్యలు. ఇటీవల ఇంధన నిల్వలు, అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ విక్రయాలను అరికట్టేందుకు ప్రభుత్వం కొన్ని కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా క్యాన్లలో డీజిల్ విక్రయాలపై పరిమితులు, భారీ పరిమాణంలో ఇంధన కొనుగోళ్లపై ప్రత్యేక నిఘా, కమర్షియల్ వినియోగానికి సంబంధించిన నియంత్రణలు అమలులో ఉన్నాయి.ఈ నిబంధనల కారణంగా బంకు యాజమాన్యాలు కూడా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయని తెలుస్తోంది. ఫలితంగా నిజమైన రైతులు కూడా అవసరమైన డీజిల్ పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి బంక్ యాజమాన్యానం పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అనే చందంగా ఉందని వాపోతున్నారు. చట్టాలను ఉల్లంఘనలకు కఠిన శిక్షలు అంటూ ప్రభుత్వాలనుంచి ఒత్తిడిలు. ఇంధన విక్రయాల నిబంధనలను ఉల్లంఘిస్తే నిత్యావసర సరుకుల చట్టం 1955 కింద కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని . ఉల్లంఘనలకు సంబంధించి జైలు శిక్షలు, జరిమానాలు, ఇంధనం, వాహనాల స్వాధీనం వంటి చర్యలు అమలు చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.అంతేకాకుండా సంస్థలు లేదా వ్యాపార సంస్థలు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులైన నిర్వాహకులు, మేనేజర్లు, అధికారులపై కూడా కేసులు నమోదు చేసే అవకాశముంది. ఈ నేపథ్యంలో బంకు యాజమాన్యాలు కూడా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి.వ్యవసాయ సీజన్‌లో ఏజెన్సీ ప్రాంత రైతులకు ప్రత్యేక అనుమతులు కల్పించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. గ్రామ స్థాయిలో రైతు ధృవీకరణ ఆధారంగా క్యాన్లలో డీజిల్ అందించే విధానాన్ని పరిశీలించాలని సూచిస్తున్నాయి. దీంతో వ్యవసాయ పనులకు ఆటంకం లేకుండా, అదే సమయంలో అక్రమ వినియోగాన్ని కూడా అరికట్టవచ్చని అభిప్రాయపడుతున్నాయి.అధికారుల జోక్యంతో రైతులకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్న రైతులు డీజిల్ సరఫరా అంశంపై వీజిలెన్స్ అధికారులు, తహసీల్దార్, జిల్లా సరఫరా శాఖ అధికారులు, కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయ అవసరాలు చట్టపరమైన నిబంధనల మధ్య సమతుల్యత సాధిస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని స్థానిక రైతు సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. సమస్యను తక్షణం పరిష్కరించకపోతే పెట్రోల్ బంకుల ఎదుట, తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి నిరసన కార్యక్రమాలు నిర్వహించే అవకాశముందని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక హెచ్చరించింది.వ్యవసాయ సీజన్‌లో డీజిల్ అందుబాటు రైతుకు ప్రాణాధారం. అక్రమ విక్రయాలను అరికట్టే చట్టాలు ఎంత అవసరమో, నిజమైన రైతు అవసరాలను తీర్చే ప్రత్యేక విధానం కూడా అంతే అవసరమని చర్ల ఏజెన్సీ రైతాంగం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది.

## బిజెపి నాయకుల ఆధ్వర్యంలో అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమం



సత్తుపల్లి జూన్ 16 (వుదయం ప్రతినిధి ) వేంసూరు మండల పరిధిలోని చౌడవరం గ్రామంలో ఘనంగా "అమ్మ పేరుతో ఒక మొక్క" కార్యక్రమం ప్రధాని నరేంద్ర మోదీ గారి 12 ఏళ్ల సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, జాతీయ పార్టీ పిలుపు మేరకు బుధవారం వేంసూరు మండలం చౌడవరం గ్రామంలో "అమ్మ పేరుతో ఒక మొక్క" కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల వీరంరాజు మరియు బీజేపీ ఓబీసీ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ పర్సా రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు ధూపాటి లచ్చిరాజు ఆధ్వర్యంలో మరియు ఎస్టీ మోర్చా మండల అధ్యక్షులు మూడు సీతారాం,యమవరపు అప్పారావు పర్యవేక్షణలో ఈ సేవా కార్యక్రమం జరిగింది. గ్రామంలోని రామాలయం వద్ద నాయకులు, గ్రామస్తులు కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు వీరంరాజు, రాంబాబు మాట్లాడుతూ.. మోదీ గారి 12 ఏళ్ల సుపరిపాలన దేశాభివృద్ధికి బాటలు వేసిందని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా "అమ్మ పేరుతో ఒక మొక్క" నాటడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్హత లేని వైద్యం ప్రాణాలకు ప్రమాదం ప్రభుత్వ ఆసుపత్రులనే ఆశ్రయించండి

- ఆర్ఎంపి డాక్టర్ల వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 17 (వుదయం ప్రతినిధి)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో అర్హత లేని ఆర్ఎంపి డాక్టర్ల వద్ద వైద్యం చేయించుకోవడం వల్ల ప్రజలు ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, ఈ అంశంపై జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజా సంఘాలు, మేధావులు కోరుతున్నారు.అనారోగ్యానికి గురైన సమయంలో సమీపంలో ప్రభుత్వ ఆసుపత్రులు లేదా అర్హత కలిగిన వైద్యులు అందుబాటులో లేకపోవడంతో చాలామంది గ్రామీణ ప్రజలు ఆర్ఎంపి డాక్టర్లను ఆశ్రయిస్తున్నారు. అయితే సరైన వైద్య అర్హతలు లేకుండా మందులు ఇవ్వడం, ఇంజెక్షన్లు వేయడం, తీవ్రమైన కేసులను కూడా చికిత్స చేయడానికి ప్రయత్నించడం వల్ల రోగుల ఆరోగ్యం మరింత ప్రమాదంలో పడే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా గ్రామాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రజలు అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలను మాత్రమే ఆశ్రయించేలా చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉంది. అలాగే అర్హత లేని వైద్య సేవలు అందిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తే అనవసర ప్రాణనష్టాలను నివారించవచ్చని ఆరోగ్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలపై మరింత పర్యవేక్షణ అవసరమని వారు సూచిస్తున్నారు.

## వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి



చర్ల, జూన్ 17:(వుదయం ప్రతినిధి) వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక సూచించారు.దోమల నివారణ కోసం ప్రతి మంగళవారం, శుక్రవారం "ఫ్రైడే--డ్రై డే" కార్యక్రమాన్ని పాటిస్తూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కూలర్లు, పాత టైర్లు, త్రాగి పడేసిన కొబ్బరి బోండాలు, ఖాళీ సీసాలు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా చూడాలని సూచించారు.ఆహార పరిశుభ్రత పాటిస్తూ తాజాగా తయారుచేసిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, బయట విక్రయించే అపరిశుభ్రమైన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా తెలిపారు . కాచి చల్లార్చిన లేదా శుద్ధి చేసిన నీటి నే త్రాగాలని సూచించారు.జ్వరం, విరేచనాలు, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని, ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ హారిక ప్రజలకు తెలిపారు .

## దానవాయిపేట పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం



చర్ల, జూన్ 17(వుదయం ప్రతినిధి) చర్ల మండలం ఆర్.కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని దానవాయిపేట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యా సంవత్సర ప్రారంభ వేళ చిన్నారులకు విద్యపై ఆసక్తి పెంపొందించడం, పాఠశాలల్లో ప్రవేశాలను ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు నానరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులకు తొలి అక్షరాలు దిద్దించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టించారు. అక్షరాభ్యాసం సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నానరాజు మాట్లాడుతూ, ప్రతి చిన్నారి జీవితంలో అక్షరాభ్యాసం ఒక కీలక ఘట్టమని పేర్కొన్నారు. విద్యే వ్యక్తి భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనమని, విద్య ద్వారా సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ తుర్రం రవికుమార్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి విద్యే ప్రధాన ఆధారమని తెలిపారు . చిన్నారులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, ప్రతి తల్లితండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జున్ రావు, వార్డు సభ్యులు కారం సుధాకర్, కణితి రజిని, కొమరం భద్రయ్య, చింతకాయల స్వరూప అంగన్వాడీ టీచర్ చిలకమ్మ, పుష్ప, రామంజమ్మ ఉపాధ్యాయులు సుహాసిని చింతకాయల హరిబాబు, పూర్ణిమ, శాంతకుమార్, నీలిమ గ్రామస్తులు పాల్గొన్నారు.

## వుదయం తెలుగు దినపత్రిక ప్రత్యేక కథనం

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి
- ముందస్తు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకుందాం




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 17 (వుదయం ప్రతినిధి) వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ కాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్, టైఫాయిడ్, జలుబు, దగ్గు, విరేచనాలు వంటి వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.జిల్లాలో ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల పెరుగుదల అధికమవుతోంది. దీంతో డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల ప్రమాదం పెరుగుతోంది. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.తీసుకోవాల్సిన జాగ్రత్తలుతాగునీటిని తప్పనిసరిగా మరిగించి లేదా శుద్ధి చేసి ఉపయోగించాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

కూలర్లు, టైర్లు, కుండీలు, డబ్బాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.దోమతెరలు, దోమల నివారణ మందులు ఉపయోగించాలి.బయట ఆహార పదార్థాలను వీలైనంత వరకు నివారించాలి.చేతులను తరచుగా సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలి.వైద్య శాఖ సూచనలుజిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రామాలు, పట్టణాల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు సూచనలు అందిస్తోంది.ప్రజల సహకారం అవసరంసీజనల్ వ్యాధుల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని వైద్య అధికారులు పేర్కొంటున్నారు. చిన్నచిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా కుటుంబ సభ్యులను, సమాజాన్ని వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు."అప్రమత్తతే ఆరోగ్య రక్షణకు మొదటి మెట్టు" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని వైద్య శాఖ విజ్ఞప్తి చేసింది.

## కోర్టు ప్రాంగణంలో హెల్త్ కార్డు కరపత్రాల ఆవిష్కరణ.



ఇల్లందు, జూన్17, (వుదయం)ఇల్లందు కోర్టు ఆవరణలో ఆల్ ఇండియా లాయర్ యూనియన్ కమిటీ ప్రెసిడెంట్ సుడిగాలి వెంకట నరసయ్య , బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భూక్యా రవికుమార్ నాయక్ ఆధ్వర్యంలో న్యాయవాదుల హెల్త్ కార్డు గురించి కరపత్రాలు పంచి ఈనెల 20వ తారీకున హైదరాబాద్ లో ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నాకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మరియు జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు...



## అమ్మ మాట అంగన్‌వాడి బాట..

పినపాక జూన్: 17వుదయం ప్రతినిధిభద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని ఈ బయ్యారం గ్రామపంచాయతీ పరిధిలోని గాండ్లబయ్యారం గ్రామంలో బుధవారం ఆమ్మ మాట అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, చిన్నారుల పోషకాహారం, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణ, ప్రీ-స్కూల్ విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమం లో అంగన్వాడీ టీచర్ సావిత్రి, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు మల్లీశ్వరి,ప్రవల్లిక, వెంకట నరసమ్మ, వెంకటలక్ష్మి,స్థానిక ప్రజలు, మహిళలు, అంగన్‌వాడి సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లా టిపి టిఎఫ్ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ సమక్షంలో పెన్ పహాడ్ మండలం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

సూర్యాపేట జూన్ 17వుదయం ప్రతినిధి




టిపిటిఎఫ్ సూర్యాపేట జిల్లా కార్యాలయంలో సోమవారం పెన్‌పహాడ్ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షులు శ్రీ బండారి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీ పుప్పాల వీరన్న సమక్షంలో ఈ సమావేశం నిర్వహించారు.ఎన్నికల పరిశీలకులు శ్రీ శిరగాని యాకయ్య సమక్షంలో టి పి టి ఎఫ్ పెన్‌పహాడ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**నూతన కార్యవర్గం:**

గౌరవ అధ్యక్షులు: శ్రీ పల్స.వెంకన్న, జిహెచ్ఎం చీదెళ్ల

గౌరవ సలహాదారు: శ్రీ చీకూరి అంజయ్య, జిహెచ్ఎం గాజుల మల్కాపురం

అధ్యక్షులు: ఎండి. ఖాజా మొయినుద్దీన్, ఎస్ ఏ, జడ్పీహెచ్ఎస్ అనాజిపురం

ప్రధాన కార్యదర్శి: ఎ. శ్రీధర్, ఎస్ ఎ, పెన్‌పహాడ్ జిల్లా కౌన్సిల్:1) శ్రీ తన్నీరు రమేష్, ఎస్ జి టి, ఎంపీపీ ఎస్ నారాయణగూడెం 2) శ్రీ శీలం రాములు, ఎస్ జి టి, ఎంపీపీ ఎస్ చీదెళ్ల ఇతర కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షులు తెలిపారు.

## మధిరలో కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏలకు శిక్షణ శిబిరం.



మధిర జూన్ 17, వుదయం ప్రతినిధి: దెందుకూరు శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏలకు శిక్షణ శిబిరం నిర్వహించబడింది.ఈ సందర్భంగా దుద్దిళ్ల శ్రీనుబాబు మాట్లాడుతూ,ఎన్నికల ప్రక్రియలో బిఎల్ఏల పాత్ర అత్యంత కీలకమని,ఓటరు జాబితాల పరిశీలన, సవరణలు, అభ్యంతరాల నమోదు, అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో చేర్చే విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పని చేస్తూ, పార్టీ బలోపేతానికి ప్రతి బిఎల్ఏ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు తోడ్పడాలని తెలిపారు.ఈ శిక్షణ శిబిరంలో మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు,మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహ రావు, సూరం శెట్టి కిషోర్ జిల్లా నాయకులు కర్నాటి రామారావు, పులి బండ్ల చిట్టిబాబు, దుంప వెంకటేశ్వర రెడ్డి, షేక్ జహంగీర్ కాంగ్రెస్ పార్టీ, బిఎల్ఏలు పాల్గొన్నారు.

## అంబారుపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ.



మధిర జూన్ 17, వుదయం ప్రతినిధి అంబారుపేట గ్రామ ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి గ్రామ కౌన్సిలర్ బెజ్జం రాజు మరియు కర్నాటి శ్రీను ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. పాఠశాల హెడ్‌మాస్టర్ ఆధ్వర్యంలో, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.నేటి పాఠ్యపుస్తకం రేపటి విజయానికి పునాది విద్యార్థుల భవిష్యత్తు బంగారుమయం కావాలని కోరారు.

